

16న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 16న నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం పది గంటలకు జెడ్‌పి సమావేశ మందిరంలో సమావేశాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఉదయం పది గంటలకు 6వ స్థాయి, 11 గంటలకు 3వ, మధ్యాహ్నం 12 గంటలకు 5వ స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు గంటలకు 2వ స్థాయి, మూడు గంటలకు 4వ, సాయంత్రం నాలుగు గంటలకు 7వ, ఐదు గంటలకు ఒకటో స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశాలకు స్థాయీ సంఘాల సభ్యులు, పలు శాఖల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.



సిఎం సారూ సమస్యలు వినరూ...

- కరువు పరిస్థితులతో నష్టపోయిన అన్నదాతలు
- జీడి మద్దతు ప్రకటన కోసం రైతాంగం ఎదురుచూపులు
- ఆధునికీకరణకు నోచని వంశధార ఎడమ కాలువ
- అపరిష్కృతంగానే షట్టర్ల సమస్య
- నేడు సిఎం జగన్మోహన్ రెడ్డి జిల్లాకు రాక
- పలాసలో కిడ్నీ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి
- మకరాంపురంలో వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు ప్రారంభం

ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం జిల్లాకు రానున్నారు. పలాసలో నూతనంగా నిర్మించిన కిడ్నీ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి, కంచిలిలో వైఎస్సార్ సుజలధార మంచినీటి ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. అనంతరం కాశీబుగ్గ రైల్వే మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో తిష్ట వేసిన అనేక సమస్యల పరిష్కారానికి ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా జిల్లా రైతాంగం కరువుతో అల్లాడిపోతోంది. జీడిపిక్కలకు మద్దతు ధర, ఆర్‌బికెల ద్వారా కొనుగోలుపై ప్రభుత్వం తరుపున మంత్రులు ఇచ్చిన మాట నేటికీ నెరవేరలేదు. ప్రభుత్వాలు మారుతున్నా వంశధార ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు ఆధునికీకరణకు నోచుకోవడం లేదు. సిఐడి కేసులతో వంశధార షట్టర్ల అంశం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. సిఎం చొరవ చూపితే గానీ ఆ సమస్య పరిష్కారమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. వీటిపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించే నిర్ణయాలపై అందరూ ఆశలు పెట్టుకున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది కరువు పరిస్థితుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఖరీఫ్‌లో 4,37,153 ఎకరాల్లో పంటలు వేయాల్సి ఉండగా 3,81,833 ఎకరాల్లోనే రైతులు పంటలు వేయగలిగారు. వరి విషయానికి వస్తే 3,98,750 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 3,53,325 ఎకరాల్లో వేశారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో 15 మండలాల పరిధిలో 20,813 ఎకరాల్లో వరి ఎండిపోయింది. ఇతర జిల్లాలతో పోలిస్తే రాష్ట్రంలో ఇక్కడ ఆలస్యంగా సాగు మొదలవుతుంది. కానీ ప్రభుత్వం సెప్టెంబర్ 30 వరకు ఉన్న పరిస్థితులనే పరిగణనలోకి తీసుకుని కరువు మండలాలను ప్రకటించింది. అక్టోబర్ వర్షాపాతాన్ని పరిగణనలోకి తీసుకుని కరువు మండలాల జాబితాలో జిల్లాకు చోటు కల్పించాలని వ్యవసాయశాఖ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపారు.

ప్రస్తుతానికి సూపర్ స్పెషాలిటీ సేవలే



ఉద్దానంలో కిడ్నీ బాధితుల సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2019 సెప్టెంబరులో పలాసకు కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్‌ను మంజూరు చేసింది. అందుకనుగుణంగా ఆస్పత్రి నిర్మాణానికి నిధుల కేటాయింపు, వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను మంజూరు చేసింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. కిడ్నీ వ్యాధులపై ఈ ప్రాంతంలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయడాన్ని అందరూ స్వాగతిస్తున్నారు. ప్రస్తుతానికి మాత్రం సూపర్ స్పెషాల్టీ సేవల వరకే అందనున్నాయి. ఇందుకు సంబంధించి మొత్తం 60 మంది వైద్యులను భర్తీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 56 మందిని నియమించారు. కీలకమైన నెఫ్రాలజీ విభాగానికి మూడు పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా, ఒక్కరిని మాత్రమే నియమించి మరో రెండు పోస్టులను ఉద్యోగోన్నతి ద్వారా భర్తీ చేయనున్నారని తెలిసింది. నర్సింగ్ సేవల కోసం 60 మంది సిబ్బంది అవసరం కాగా 46 మందిని నియమించారు. ఆస్పత్రిలో 40 మంది సహాయ సిబ్బంది అవసరం కాగా 15 మందిని నియమించారు. ఆపరేషన్ థియేటర్‌లో 20 శాతం మేర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంకా సమకూర్చుకోవాల్సి ఉంది. రీసెర్చ్‌కు సంబంధించిన పరికరాలు రాకపోవడంతో ప్రస్తుతానికి మాత్రం కొంతవరకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందనున్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్‌ను డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి తీసుకురావడంతో బడ్జెట్ కేటాయింపులు, మౌలిక వసతులు, వైద్యుల నియామకాలకు ఇబ్బంది ఉండదని వైద్య నిపుణులు చెప్తున్నారు. ఉద్దానం ప్రాంత ప్రజలు వైద్య సేవల కోసం బరంపురం, విశాఖ వెళ్లాల్సిన అవసరం ఉండదంటూ కిడ్నీ బాధితుల తరుపున పోరాడుతున్న నాయకులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీడి మద్దతు ప్రకటనపై రైతుల ఆశలు

జీడి పిక్కలకు ఏప్రిల్ రెండో వారం వరకు 80 కేజీల బస్తాకు రూ.10,500 వరకు చెల్లించారు. పంట చేతికి రావడం, రైతుల వద్ద పుష్కలంగా పిక్కలు ఉండడంతో క్రమేణా ధర తగ్గిస్తూ రూ.8 వేలు వరకు ఇచ్చారు. దళారులు, వ్యాపారుల నుంచి కాపాడాలంటే 80 కేజీల బస్తాకు రూ.16 వేలు, ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు దీక్షలు, ధర్నాలు తదితర రూపాల్లో ఆందోళనలు కొనసాగించారు. జీడిపిక్కలకు మద్దతు ధర, కొనుగోలు అంశంపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందంటూ మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ హామీనిచ్చి నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు అమలు కాలేదు.

ఆధునికీకరణకు నోచని వంశధార కాలువలు

వంశధార ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన నాటి నుంచి కాలువలు ఆధునికీకరణ పనులకు నోచుకోలేదు. ప్రధానంగా ఎడమ కాలువ పరిస్థితి దయనీయంగా ఉంది. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1600 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. ఆధునికీకరణ పనులకు రూ.834 కోట్లు అవసరమని 2021-22 కొత్త ఎస్ఎస్ఆర్ (షెడ్యూల్ స్టాండర్డ్ రేట్స్)తో నివేదికను గతేడాది పంపారు. ఏడాది గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. గొట్టాబ్యారేజీ కుడి కాలువ ప్రధాన కాలువదీ అదే దుస్థితి. కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రాంతంలో సిసి లైనింగ్ పనుల కోసం 2021-22లో 18.45 కోట్లతో అంచనాలతో రూపొందించిన ప్రతిపాదనలూ పెండింగ్‌లోనే ఉన్నాయి.

షట్టర్ల సమస్యకు చూపాలి ఓ పరిష్కారం

వంశధార శివారు భూముల సాగునీటికి షట్టర్ల కుంభకోణం కేసు అడ్డంకి మారింది. షట్టర్ల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై 2009లో సిఐడి కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. ఘటన జరిగి 13 ఏళ్లు అవుతున్నా, నేటికీ విచారణ కొలిక్కి రాలేదు. దీంతో కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. సిఎం చొరవతోనే ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది.

మత్స్యకారులకు లేని కోల్డ్ స్టోరేజీలు

జిల్లాలో 193 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరం ఉన్నా, ఎక్కడా ఒక్క కోల్డ్ స్టోరేజ్ లేదు. దీంతో మత్స్యకారులు ఏ రోజు మత్స్య సంపదను ఆ రోజే అమ్ముకోవాల్సి వస్తుండడంతో, సరైన ధర దక్కడం లేదు. పాలకులు మారుతున్నా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం మత్స్యకారులకు నెరవేరని కోరికగానే మిగిలింది.

తమ పిల్లలను చదివించుకునేందుకు ఆశ్రమ పాఠశాల కావాలని మత్స్యకారులు చాలా కాలంగా అడుగుతున్నారు. భావనపాడు పోర్టు నిర్మాణంతో భావనపాడు, గెద్దలపాడు ప్రాంతాల్లో మత్స్యకారులకు ఆ ప్రాంతంలో చేపల వేట సాధ్యపడదని, జగన్నాథపురం ప్రాంతంలో మినీ జెట్టీ నిర్మాణం చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ఒక్క అడుగూ పడని ఫిషింగ్ హార్బర్ పనులు

సంతబొమ్మాళి మండలం మూలపేటలో ఈ ఏడాది ఏప్రిల్ 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పోర్టు పనులకు శంకుస్థాపన చేశారు. అదే రోజున ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. పోర్టు పనులు చాలా వేగంగా సాగుతున్నా, హార్బర్ పనుల్లో మాత్రం ఒక్క అడుగూ ముందుకు పడలేదు.



సిద్ధమవుతున్న సభా వేదిక

సిఎం పర్యటనకు సర్వం సిద్ధం

- 2,400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు
- 160 ఆర్‌టిసి బస్సులు వినియోగం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో అధికారులు అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. పలాసలో కిడ్నీ ఆస్పత్రి నుంచి హెలీప్యాడ్ వరకు, అక్కడ్నుంచి బహిరంగ సభ నిర్వహించే రైల్వే క్రీడా మైదానం వరకు సిఎం జగన్ రోడ్ షోగా వెళ్లే బస్సుతో పాటు కాన్వాయ్‌తో బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. హెలీప్యాడ్ నుంచి రోడ్డుకు ఇరువైపులా భారీస్థాయిలో బారికేడ్లను ఏర్పాటు చేశారు.

2,400 మంది పోలీసులతో బందోబస్తు

సిఎం పర్యటనకు మొత్తం 2,400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ముగ్గురు అదనపు ఎస్‌పిలు, 13 మంది డిఎస్‌పిలు, 23 మంది సిఐలు, 56 మంది ఎస్ఐలు, 1498 మంది ఎఎస్ఐలు, హెచ్‌సిలు, పిసిలు, 40 మంది ఆర్మ్‌డ్ ఫోర్స్‌తో వంద మందికి పైగా హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. బందోబస్తుకు సంబంధించి ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సిఎం కాన్వాయ్ వెళ్లే సమయంలో సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని తెలిపారు. విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ, ఎస్‌పి రాధిక పలాస, కంచిలి మండలాల్లోని సిఎం పర్యటన ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాట్లు, రూట్‌మ్యాప్ పాయింట్లను పరిశీలించారు.

ఐదు ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు

పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీ పరిధిలో ఐదు ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు. పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్, పలాస జూనియర్ కళాశాల, కోసంగిపురం జంక్షన్, సిఎం బహిరంగ సభ ప్రాంగణం, హెలీప్యాడ్ వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సభకు హాజరైన వారికి తాగునీరు, ఇతర సౌకర్యాల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

160 ఆర్‌టిసి బస్సులు వినియోగం

సిఎం సభకు జనాన్ని తరలించేందుకు 160 ఆర్‌టిసి బస్సులను వినియోగిస్తున్నారు. శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోలతో పాటు టెక్కలి, పలాస డిపోల నుంచి బస్సులను ఉపయోగించనున్నారు. వీటితోపాటు పలు ప్రయివేటు పాఠశాలల బస్సులను వినియోగిస్తున్నారు.

పలాస-కాశీబుగ్గలో ట్రాఫిక్ ఆంక్షలు

సిఎం పర్యటన నేపథ్యంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రజలకు, సభకు హాజరైన వారికి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆ ఆంక్షలు విధించినట్లు కాశీబుగ్గ డిఎస్‌పి కె.నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ట్రాఫిక్ ఆంక్షలు ఈ విధంగా ఉన్నాయి.

రూట్ రూట్ నంబర్ 1 : ఇచ్ఛాపురం నుంచి కోసంగిపురం కూడలి మీదుగా పలాసకు వచ్చే ప్రజలు, ఇతర వాహనాలు ఫ్లై ఓవర్ పై నుంచి ముందుకెళ్లి మొగలిపాడు జంక్షన్ మీదుగా పలాస ఊరులోకి చేరుకోవాలి.

రూట్ నెంబర్ 2 : బెండిగేటు నుండి మూడు రోడ్ల జంక్షన్ మీదుగా కోసంగిపురం జంక్షన్ వైపు వచ్చే ప్రజలు, బెండిగేటు నుంచి మూడు రోడ్ల జంక్షన్ మీదుగా కోసంగిపురం జంక్షన్ వైపు వెళ్లాల్సిన వాహనాలు మూడు రోడ్ల జంక్షన్ పై నుంచి కాశీబుగ్గ మీదుగా పలాస వెళ్లి మొగలిపాడు జంక్షన్ మీదుగా హైవే మీదుగా కోసంగిపురం జంక్షన్ వైపు వెళ్లాలి. సభాస్థలికి ప్రజలను తీసుకొచ్చే బస్సులు పలాస జూనియర్ కళాశాల వద్ద పార్కింగ్ చేయాలి. హెలీప్యాడ్‌కు వచ్చే వారు వారి వాహనాలను మంత్రి కార్యాలయం వద్ద నిలపాలి. అక్కుపల్లి నుంచి వచ్చే వాహనాలు కాశీబుగ్గ వైపు అనుమతించబడవు. రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు ఉదయం ఎనిమిది గంటలకు ముందే రైల్వేస్టేషన్‌కు చేరుకోవాలి. ఈ ఆంక్షలు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అమల్లో ఉంటాయి.

చంద్రబాబు పాలన అంతా వంచనే

- అధికారం ఇవ్వాలని అడిగే హక్కు లేదు
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, మెళియాపుట్టి

చంద్రబాబును నమ్మి ఓట్లేస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను వంచించారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. వైసిపి సామాజిక సాధికార యాత్ర సందర్భంగా పాతపట్నం కూడలిలో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయని చంద్రబాబుకు మళ్లీ ఓటు వేయాలని ప్రజలను అడిగే హక్కు లేదన్నారు. టిడిపి హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను బెదిరించి భయపెట్టి పాలించారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా, పేదరికం మాత్రమే చూసి రూ.2.40 లక్షల కోట్లను సంక్షేమ పథకాల రూపంలో అందించారని చెప్పారు. పథకాల కోసం ఏ ఒక్కరైనా ఎవరికైనా ఒక్క పైసా లంచం ఇచ్చారా అని ప్రశ్నించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పాలనాపరమైన సంస్కరణలను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ, టిడిపి ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీలదే రాజ్యంగా ఉండేదన్నారు. సంక్షేమ పథకాల అమల్లో పైసా లంచం తీసుకున్నట్లు రుజువు చేస్తే తన పదవికి రాజీనామా చేస్తానని టిడిపి నాయకులకు సవాల్ విసిరారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రూ.1800 కోట్లు మంజూరు చేసారని తెలిపారు. కాగువాడలో ఎనిమిది నెలల కాలంలో రూ.11 కోట్లతో కాగువాడ బ్రిడ్జిని నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు వంశధార నిర్వాసితులకు అన్యాయం చేసిందని, వైసిపి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్వాసితులకు అదనంగా రూ.216 కోట్ల పరిహారం ఇచ్చారని తెలిపారు. సభలో వైసిపి ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి వై.వి సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, గొర్లె కిరణ్ కుమార్, వి.కళావతి, కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎంపీ కిల్లి కృపారాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

అంగన్వాడీలపై ప్రభుత్వం కక్ష

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అంగన్వాడీలపై వైసిపి ప్రభుత్వం కక్ష కట్టిందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన అనంతరం తక్కువ బడ్జెట్ ఉన్న సమయంలోనూ టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.4,200 ఉన్న అంగన్వాడీల జీతాన్ని రూ.10,500కు పెంచినట్లు తెలిపారు. తెలంగాణ కంటే ఎక్కువ జీతం ఇస్తామని నమ్మబలికి అధికారంలోకొచ్చిన జగన్ కేవలం రూ.వెయ్యి పెంచి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. తెలంగాణలో అంగన్వాడీల జీతం రూ.13,650 కాగా, మన రాష్ట్రంలో రూ.11,500 ఉందన్నారు. పొరుగు రాష్ట్రంతో సమానంగా జీతం పెంచకపోగా, సంక్షేమ పథకాలకు అంగన్వాడీలను దూరం చేశారని ధ్వజమెత్తారు. రాజకీయ కక్షతో అంగన్వాడీలను వేధిస్తున్నారని విమర్శించారు. నాలుగున్నరేళ్ల పాలనలో అంగన్వాడీల సమస్యలను జగన్ పట్టించుకున్న పాపానపోలేదన్నారు. అంగన్వాడీలను పోలీసు లారీలతో చితకబాదించిన సంఘటనలు ఎవరూ మర్చిపోలేరని చెప్పారు. టిడిపి ప్రభుత్వ హయాంలో మనోవికాస కేంద్రాలుగా పనిచేసిన అంగన్వాడీ కేంద్రాలు, జగన్ అసమర్థ పాలనలో సమస్యల వలయంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నాయన్నారు.

5న ఎండిఎం కార్మికుల చలో విజయవాడ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మధ్యాహ్న భోజన పథకం మెనూ ఛార్జీలు పెంచాలని, వర్కర్లు, హెల్పర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి ఐదో తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి తెలిపారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో చలో విజయవాడ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తర, సుశీలతో కలిసి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.10 వేలు వేతనం ఇస్తామని పాదయాత్రలో ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేషనలైజేషన్ పేరుతో పాఠశాలల విలీనం వల్ల మధ్యాహ్న భోజన కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. డ్రాపౌట్స్ తగ్గించాలని, పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు పౌష్టికాహారం అందించే మధ్యాహ్న భోజన పథక లక్ష్యాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు పెంచకపోగా తగ్గించిందన్నారు. పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా 90 : 10 శాతాన్ని మోడీ ప్రభుత్వం 60 : 40 శాతానికి తగ్గించిందన్నారు. రోజులు 7, 8 గంటలు శ్రమిస్తున్న కార్మికులకు యూనియన్ పోరాటంతో రూ.మూడు వేల గౌరవ వేతనం సాధించుకున్నట్లు తెలిపారు. పథకానికి బడ్జెట్ పెంచాలని, ప్రయివేటు సంస్థలకు అప్పగించరాదని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.లక్ష్మి, కె.అన్నపూర్ణ, కె.నారాయణమ్మ, ఎం.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎండిఎం కార్మికులు

5న ఓటర్ల తుది జాబితా విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ముసాయిదా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, ఇతర సవరణల అనంతరం ఓటర్ల తుది జాబితాను జనవరి ఐదో తేదీన వెలువరించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు వెల్లడించారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అంశాల వారీగా సమీక్షించారు. పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకుని, వారి నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 9వ తేదీతో తుది గడువు ముగిసిందన్నారు. 50 వేలకు పైగా దరఖాస్తులు చివరి వారం రోజుల్లో వచ్చాయని, ఈనెల 26వ తేదీ నాటికి వాటి పరిశీలన పూర్తి చేస్తామని చెప్పారు. మార్పులు, చేర్పుల అనంతరం వచ్చే నెల 5వ తేదీన తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. అర్హత ఉన్న వారు ఓటు హక్కు పొందేందుకు మాత్రం ఫారం-6ను నేరుగా గానీ, ఆన్‌లైన్‌లో గానీ ఇవ్వవచ్చని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వాటిని పరిశీలించి, నామినేషన్లకు పది రోజుల ముందు ప్రచురించే అనుబంధ (సప్లిమెంట్) జాబితాలో చేర్చుతామని వివరించారు. పేర్ల తొలగింపునకు సంబంధించి, ఇప్పటికే ఆయా వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు రౌతు శంకరరావు, టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, కాంగ్రెస్ నాయకులు డి.మల్లిబాబు, బిజెపి నాయకులు చల్లా వెంకటేశ్వరరావు, బిఎస్‌పి నాయకులు సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ గణపతిరావు

27 నుంచి 'నాక్' పర్యటన

ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు నాక్ బృందం శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిని పరిశీలించనుందని ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి తెలిపారు. నాక్ పర్యటన నేపథ్యంలో అధికారులు, అధ్యాపకులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆరేళ్లుగా ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యను అందిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. దేశంలోనే అతి పెద్ద ప్రభుత్వ రెసిడెన్షియల్ యూనివర్సిటీ రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ అని తెలిపారు.

యూనివర్సిటీకి నాక్ గ్రేడ్ వస్తే ఇంకా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదన్నారు. సమావేశంలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ డాక్టర్ కె.వెంకట గోపాల ధన బాలాజీ, ఒఎస్‌డి ఎల్.డి సుధాకర్‌బాబు, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ అధికారి అసిరినాయుడు, డీన్ వెల్ఫేర్ గేదెల రవి, సిహెచ్.వాసు పాల్గొన్నారు.

సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం కుట్ర


మాట్లాడుతున్న మోహనరావు

జీడికి మద్దతు ధర కల్పించాలి

రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మోహనరావు

ప్రజాశక్తి - పలాస

జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి దళారీల దోపిడీని అరికట్టాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ అన్నారు. కాశీబుగ్గ సిఐటియు కార్యాలయంలో బుధవారం రైతు సంఘం ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి రైతుల సమస్యలను గురువారం పలాస వస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లమని అన్నారు. రైతుల నుంచి సేకరించిన లక్ష సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. జీడి పిక్కలు 80 కేజీల బస్తాకి రూ.16 వేలు ధర ప్రకటించి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జీడి రైతులను నాలుగేళ్లుగా మోసం చేస్తున్నారన్నారు. గతంలో రూ.14 వేలు ధర పలికితే ప్రస్తుతం రూ.7 వేలు కిందికి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. జీడి రైతులను ఆదుకుంటామని సిఎం బహిరంగ సభలో చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. విదేశాల జీడి పిక్కల దిగుమతులపై ఆంక్షలు విధించాలన్నారు. కేరళ తరహాలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి జీడి పంట అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. తిత్లీ తుపానులో నష్టపోయిన జీడి, కొబ్బరి రైతులకు ఇప్పటికీ రెట్టింపు పరిహారం అందలేదని అన్నారు. జీడి రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సత్తుపల్లి కృష్ణారావు, కోనేరు గురయ్య, అంబటి రామకృష్ణ, యంపల్ల జోగారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీ సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, ఇటువంటి బెదిరింపులకు భయపడబోమని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, సిఐటియు కోశాధికారి అల్లు సత్యం తేల్చిచెప్పారు. నగరంలోని అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట రెండో రోజూ బుధవారం నిరవధిక సమ్మె శిబిరం కొనసాగించారు. ఈ శిబిరంలో పాల్గొని వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేంతవరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 ఇవ్వాలు ఇవ్వాలన్నారు. గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. 2022లోనే సుప్రీంకోర్టు అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలని తీర్పునిచ్చిందన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. ఉద్యోగోన్నతి బెనిఫిట్ రూ.5 లక్షలకు పెంచాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరాన్ని సందర్శించి ఇఫ్టు నాయకురాలు జి.కృష్ణవేణి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు జిల్లా నాయకులు కె.ప్రమీల, టి.రాజేశ్వరి, బి.సరస్వతిదేవి, ఇ.అప్పలనరసమ్మ,

రెండో రోజూ కొనసాగిన అంగన్వాడీల నిరవధిక సమ్మె

ఎం.నాగపద్మ, జి.రాజేశ్వరి, ఎస్.దమయంతి, లీలా రత్నకుమారి, డి.జ్యోతి, సిహెచ్.అరుణ, కృష్ణ, భారతి పాల్గొన్నారు.

పొందూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మెలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు, యూనియన్ నాయకులు జ్యోతిలక్ష్మి, రమ, నాగరత్నం, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో చేపట్టిన అంగన్వాడీ నిరవధిక సమ్మెకు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.కిషోర్‌కుమార్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, వై.విజయలక్ష్మి, శారద, కనకం, సరస్వతి పాల్గొన్నారు.

టెక్కలి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెలో సిఐటియు జిల్లా నాయకులు నంబూరు షణ్ముఖరావు, హెచ్.ఈశ్వరరావు, శ్రీను, ప్రాజెక్టు నాయకులు ఆర్.ఆదిలక్ష్మి, సిహెచ్.ఇందుమతి, వాణిశ్రీ, శ్రీదేవి, శ్యామల, ప్రభ, అరుణ, ఉష, కె.అన్నపూర్ణ, మల్లేశ్వరి, కృష్ణవేణి, వనజాక్షి పాల్గొన్నారు.

నరసన్నపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరవధిక సమ్మెలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, టి.సరోజిని, ఎం.భాగ్యలక్ష్మి, టి.అమరావతి, డి.సులోచన పాల్గొన్నారు. శిబిరాన్ని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామమూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షులు కె.వైకుంఠరావు, మండల ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ మద్దతు తెలిపారు.

ఆమదాలవలస ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పి.భూలక్ష్మి, ఎం.లత, పి.లక్ష్మి, కనకం అరుణకుమారి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం బస్టాండ్ కూడలి వద్ద నిర్వహించిన నిరవధిక సమ్మెలో సిఐటియు జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణరావు, హైమావతి, బాలమణి, జయ, ఉమ, పుణ్య, విజయలక్ష్మి, కోమలి, సుశీల పాల్గొన్నారు.

కోటబొమ్మాళి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెలో సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, గొండు నీలన్న దుంపల సుదర్శన పాల్గొన్నారు.


పలాస : మాట్లాడుతున్న మోహనరావు


ఎచ్చెర్ల : మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

కొత్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెకు మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రజని, కె.లక్ష్మి, హేమలత, బోడెమ్మ, ప్రజా సంఘాల నాయకులు సిర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోనారి మోహనరావు, సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి పి.కుసుమ, కె.హైమావతి, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వినోద్‌కుమార్, ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి మద్దిలి రామారావు, ఐఎఫ్‌టియు నాయకులు జి.వీరాస్వామి, ఎఐటియుసి జిల్లా నాయకులు సిహెచ్.వెంకటరమణ పాల్గొని సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ప్రాజెక్టు కన్వీనర్ సునీత, యూనియన్ నాయకులు ఆర్.అప్పలనరసమ్మ, ఆర్.భవాని, పి.గన్నెమ్మ, ఎం.కరుణ, బి.నిర్మల, ఎం.తులసి, పి.కళ్యాణి, పి.పద్మావతి, పార్వతి పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలు


నరసన్నపేట : నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు


కొత్తూరు : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలో ఈ నెల 14 నుంచి 20 వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎపి తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షక ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంధర్భాన్ని పురస్కరించుకొని విద్యుత్ పొదుపు అవగాహనా ర్యాలీలు జిల్లా ప్రధాన కేంద్రం, డివిజన్ కేంద్రాల్లో ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. స్వయం సహాయక మహిళా బృందాలకు ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్ గృహోపకరణాలు ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామని అన్నారు. 'విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానం' అనే అంశంపై నిష్ణాతులచే ఇంజినీరింగ్ కాలేజీల్లో వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత గురించి వినియోగదారులతో అన్ని విద్యుత్ కార్యాలయాల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. 20న విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులను కించపరచడం తగదు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ఎంఇఒ-1 దల్లి తులసీరావురెడ్డిను యుటిఎఫ్ నాయకులు బుధవారం కలిశారు. స్థానిక మండల రిసోర్స్ కార్యాలయంలో పలు అంశాలపై చర్చించారు. ఉపాధ్యాయులపై ఎంఇఒ అనుసరిస్తున్న వైఖరి సమంజసంగా లేదన్నారు. మహిళా ఉపాధ్యాయులను కించపరిచేవిధంగా మాట్లాడడం సబబు కాదన్నారు. నిబంధనల మేరకు నాడు-నేడు పనులు చేపడుతుంటే... ఎంఇఒ జోక్యం చేసుకోవడంతో వివాదస్పదంగా మారుతుందన్నారు. పలువురు బాధిత ఉపాధ్యాయులు తమ వద్ద సమస్యలను విన్నవించుకున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎంఇఒ సానుకూలంగా స్పందిస్తూ... ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. నిబంధనల మేరకు తాను విధులు నిర్వర్తిస్తున్నట్టు తెలిపారు. త్వరలో ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించాలని నాయకులు కోరగా, ఎంఇఒ సానుకూలంగా స్పందించారు. అనంతరం వినతిపత్రం అందించారు. సమావేశం ఎంఇఒ-2 దాసుపురం చిన్నారావు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు పడాల గణపతిరావు, ప్రధాన కార్యదర్శి తమ్మినేని వైకుంఠరావు, జిల్లా సహాయ కార్యదర్శి కురమాన దాలయ్య, సీనియర్ నాయకులు పాలవలస ధర్మారావు, దవళ వైకుంఠరావు, డి.లక్ష్మీనారాయణ, ఎన్.ప్రభావతి, మారం కుమారస్వామి, రోణంకి విజయ్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వంశధార నిర్వాసితులకు

ఇచ్చిన హామీ ఏమైంది

శ్రీకాకుళం అర్బన్ : వంశధార నిర్వాసితులకు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 2013 భూసేకరణ చట్టం వర్తింపజేస్తూ పరిహారం అందిస్తామని నమ్మబలికిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఐదేళ్లు గడుస్తున్నా ఇంతవరకు హామీలను నెరవేర్చలేదని ప్రాజెక్టుల నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో వంశధార నిర్వాసితుల పక్షాన బుధవారం బహిరంగ లేఖ రాశారు. ప్రతిపక్ష నాయకుని హోదాలో సంకల్పయాత్ర చేపట్టిన సమయంలో వంశధార నిర్వాసితులకు అధికారంలోకి వస్తే 2013 భూ సేకరణ చట్టం అమలు చేసి అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నిర్వాసితులు అడగకుండానే అదనపు ప్యాకేజీ అని చెప్పి గత ఏడాది జూన్‌లో రూ.216.77 కోట్లు ఇచ్చారని, ఇందులో రూ.189 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. అదనపు ప్యాకేజీ సగం మందికే చెల్లించారని అన్నారు.


మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

కిడ్నీ బాధితుల పాలిట వరం

ఆమదాలవలస : కిడ్నీ బాధితుల పాలిట వరం ఉద్దానం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అండ్ రీసెర్చ్ సెంటర్ అని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. బుధవారం పట్టణంలో బొడ్డేపల్లిపేట వద్ద జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సిఎం జగన్మోహన్ రెడ్డి జిల్లాలో ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ బాధితులకు శాశ్వత పరిష్కారం దిశగా రూ.800 కోట్ల వ్యయంతో చేపట్టిన త్రాగునీటి ప్రాజెక్టు, రూ.200 పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ జిల్లా వాసులకు ఒక వరమన్నారు. జగన్ మిగిలిన నాయకులు పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడులా కల్లబొల్లి మాటలు చెప్పేవాడు కాదని పేదల కష్టాలు, బాధలు తెలుసుకొని వాటి శాశ్వత పరిష్కారానికి పాటుపడే మనసున్న నాయకుడన్నారు. ఉద్దానం ప్రాంతంలో ఇప్పటికే దాదాపుగా 20వేల మంది కిడ్నీరోగాల బారిన పడి మరణించడం జరిగిందని, దశాబ్దాలుగా ఏ నాయకుడు ఇంత గొప్ప ఆలోచన చేయలేదని రవికుమార్ అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఈశ్వరరావు, అన్నెపు కృష్ణ, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, దానేటి రామ్మోహనరావు, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

కోతుల దాడిలో బాలునికి గాయాలు


గాయపడిన తేజ

ఇచ్ఛాపురం : పట్టణంలో పంజా వీధిలో ఉన్న మున్సిపల్ పాఠశాలలో బుధవారం ఒక్కసారిగా కోతుల దండు దాడి చేశాయి. దీంతో చిన్నారులు, ఉపాధ్యాయులు పరుగులు పెట్టారు. ఈ దాడిలో చాట్ల తేజపై దాడి చేయడంతో గాయపడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రోజూ ఈ కోతుల గుంపుల బెడదతో అప్రమత్తంగా ఉన్నా... ఒక్కసారిగా దాడి చేశాయని ఉపాధ్యాయులు తెలిపారు. కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని హెచ్ఎం మున్సిపల్ కమిషనర్ రమేష్ ఫిర్యాదు చేశారు.

ప్రసాద్‌కు నోటీసులు

కొత్తూరు : వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం చెల్లించాలని చలో పలాస కార్యక్రమానికి వెళ్లకుండా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నిర్ణయించింది. ఈ మేరకు కొత్తూరు ఎస్ఐ నూర్ మహ్మద్ ఎపి కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్‌కు పలాస వెళ్లనీయకుండా బుధవారం ముందస్తు నోటీసులు జారీ చేశారు. ముందస్తు నోటీసులు ఇవ్వడం దుర్మార్గమని ప్రసాద్ అన్నారు. తక్షణమే సిఎం స్పందించి నిర్వాసితులకు అదనపు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

రాపాకలో అన్నదానం

పొందూరు: మండలం రాపాక గ్రామంలో కార్తీకమాసం ముగింపుతో శివస్వాముల దీక్ష విరమణ సందర్భంగా బుధవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏటా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ కాగా, ఈ కార్యక్రమాన్ని పరిసర గ్రామాల నుంచి వేలమంది ప్రజలు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో నిరుపేదలకు దుస్తులను పంపిణీ చేశారు.

'ఆడుదాం ఆంధ్రా' కిట్లు పంపిణీ

కొత్తూరు: సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రాలో క్రీడాకారులు పాల్గొవాలని వైసిపి జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయాలకు ఆడుదాం ఆంధ్రా కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడారంగాన్ని పట్టించుకున్న ఏకైక సిఎం జగన్మోహన్‌రెడ్డేనని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కోయిలాపు సంజీవరావు, మండల ప్రత్యేక అహ్వానితులు అంపిలి ప్రశాంత్, సవర రమేష్, పడాల వెంకటకృష్ణ, పుచ్చ అప్పారావు, ఎంపిడిఒ ఎం.పావని, ఎంఇఒ గోవిందరావు, మండల ఎఒ బి.రాంబాబు, పీడీ రాజారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.


కిట్లను పంపిణీ చేస్తున్న తులసీవరప్రసాదరావు

వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు



అవగాహన కల్పిస్తున్న రాజేంద్రకుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

వృత్తి విద్యను అభ్యసించే విద్యార్థులకు వ్యవసాయ రంగం ప్రత్యక్షం గాను, పరోక్షంగాను అనేక ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని నైర కళాశాల ఆగ్రోనమి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.రాజేంద్రకుమార్ అన్నారు. ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ పంటలకు అనుబంధంగా పిచికారీ మందుల పరిశ్రమ, అగ్రికెమ్, మార్కెటింగ్ పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వావిలపల్లి నారాయణస్వామి సూచనలతో ఒకేషనల్ విద్యార్థులకు నైర వ్యవసాయ కళాశాలలో ఒకరోజు ఒజెటి కార్యక్రమం నిర్వహించామని అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి పేర్కొన్నారు. అనంతరం హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.లక్ష్మీదుర్గ ఉద్యానవన పంటల ద్వారా చిన్నకమతాలలో ఎలా లాభాలు ఆర్జించవచ్చో అవగాహన కల్పించారు. సీజన్‌కు అనుగుణంగా ఒక ప్రణాళిక ప్రకారం బంతిపూలు, చామంతి, క్యాబేజీ, మామిడి, జామ పంటలను పండించడం ద్వారా అనూహ్య ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి సందర్శనకు అనుమతినిచ్చిన నైర కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్‌కు విద్యార్థులు, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి


కవిటి : పోస్టర్‌ను అందజేస్తున్న నాయకులు

కవిటి: టిడిపిలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బెందాళం రమేష్ అన్నారు. కవిటి బెహరా వీధిలో బుధవారం టిడిపి, జనసేన పార్టీ నాయకులు బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియంతృత్వ పోకడలతో సాగుతున్న ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిందని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరుతో రూ.100లు ఇచ్చి ట్రు ఆఫ్ ఛార్జీల పేరుతో నెలకు రూ.500లు ప్రజల వద్ద దోచుకుంటోందని ఎద్దేవా చేశారు. ఓ వైపు పెరుగుతున్న ధరలు, తరుగుతున్న ఆదాయాలతో ప్రజలు విసిగిపోయారని, మళ్లీ ఈ మాయదారి ప్రభుత్వాన్ని నమ్మే స్థితిలో లేరని స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలో కలియతిరుగుతూ టిడిపి జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వజ్జ రంగారావు, బెందాళం కామరాజు, బి.తిరుమల, కమలహాసన్, కె.ముకుంద, లోకేష్ బెహరా పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురంలో ఎంపిటిసి మాజీ సభ్యులు హనుమంతు అప్పలరాజు, లింగుబారి రామప్పడు, డోకి నానాజీ, గంగిట్ల అప్పన్న, పూజారి లక్ష్మి బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫోస్టోతో కూడిన పోస్టర్లను అందజేశారు.

టెక్కలి : మండలంలోని చిన్నరోకళ్లపల్లిలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి ఆధ్వర్యాన బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు టిడిపి మేనిఫోస్టో పోస్టర్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, ఇప్పిలి జగదీష్, మహిళా అధ్యక్షులు మెండ దమయంతి, గున్న వెంకటరమణ, బొడ్డు నాగభూషణరావు, కొప్పల నగేష్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని టిడిపి యాదవ సంఘం నాయకుడు నాగళ్ల మురళీధర్ అన్నారు. బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని పురపాలక సంఘంలోని మెట్టక్కివలసలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే 6 గ్యారంటీ పథకాలను వివరించారు. టిడిపి నాయకులు రాడ విజయ్ కుమార్, రాచకొండ రాజు, కనిమెట్ట అశోక్ పాల్గొన్నారు.

మండలంలోని శ్రీనివాసాచార్యులపేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతిరావు ఆధ్వర్యంలో అక్కులపేట గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు.

పోస్టల్ ఉద్యోగుల దీక్ష


దీక్ష చేస్తున్న పోస్టల్ సిబ్బంది

కోటబొమ్మాళి: పోస్టాఫీసుల్లో పనిచేస్తున్న జిడిఎస్ ఉద్యోగుల సమస్యలు కేంద్ర ప్రభుత్వం పరిష్కరించే వరకూ విధులను బహిష్కరిస్తామని పోస్టల్ డివిజనల్ కార్యదర్శి వి.శశిభూషణరావు స్పష్టం చేశారు. స్థానిక పోస్టాఫీసు ముందు కోటబొమ్మాళి, సంతబొమ్మాళి పోస్టల్ సిబ్బంది బుధవారం రెండోరోజు ప్లకార్డులు చేతబట్టి నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో పోస్టల్, ఆర్థిక సేవలు, ప్రభుత్వ పథకాలు అందిస్తున్న జిడిఎస్ ఉద్యోగులకు తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పనికాలం తక్షణం 8 గంటలు నిర్ణయించాలన్నారు. ప్రభుత్వ హోదాలో అన్ని రకాల అలవెన్సులు, గ్రాట్యూటీ పెంపు, మెడికల్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. గ్రామీణ తపాలా వ్యవస్థకు సంపూర్ణ ప్రభుత్వ హోదా కల్పించాలన్నారు. ఉద్యోగ సర్వీసులకు అనుగుణంగా జిడిఎస్‌లకు తక్షణమే ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ పోస్టాఫీసు జిడిఎస్ ఉద్యోగులు ప్లకార్డులు చేపబట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాము, ప్రకాశరావు, తేనేసు, సింహాచలం, మోహనరావు, పలాస, కాశీబుగ్గ, బ్రాహ్మణతర్ల, పూండి ఆర్ఎస్, హరిపురం, మందస తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో దరహాస్‌కు బంగారు పతకాలు


మాస్టర్ దరహాస్‌ను అభినందిస్తున్న హారికా ప్రసాద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

తిరుపతిలో గత నెల 9 నుంచి 11 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి సిమ్మింగ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ -19 కేటగిరిలో శ్రీకాకుళం నగరానికి చెందిన మాస్టర్ విడి దరహాస్ రెండు బంగారు పతకాలు, ఒక సిల్వర్ పతకం సాధించాడు. న్యూఢిల్లీలో జనవరి మూడు నుంచి 9 వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హారిక ప్రసాద్, లైన్స్ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షులు కరణం శోభారాణి, కోశాధికారి తర్లాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

16న రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు

రాష్ట్రస్థాయి సిమ్మింగ్ పోటీలు ఈనెల 16, 17 తేదీల్లో నరసరావుపేటలో జరగనున్నాయని అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హారిక ప్రసాద్ తెలిపారు. వీటిలో ఎంపికైన వారు బెంగుళూరులో ఈ నెల 27 నుంచి 29 వరకు సౌత్ జోన్ నేషనల్‌కు అర్హత సాధిస్తారని చెపారు.


నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న నాయకులు

రైతులను ఆదుకోవాలి

రణస్థలం రూరల్: మిచౌంగ్ తుఫాన్ వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎచ్చెర్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కొత్తకోట్ల సింహాద్రి నాయుడు కోరారు. బుధవారం మండలంలో రావాడ గ్రామంలో పంట పొలాల్లోకి వెళ్లి నష్టాల భారిన పడిన రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను వచ్చినప్పటికే కోతకోసి ఉన్న పంటలకు పంట నష్టం వర్తించదని సంబంధిత అధికారులు చెప్పడం చాలా బాధాకరమైన విషయమన్నారు. రైతు చేతికందివచ్చే పంటలను పాడుచేసుకోరన్నారు. నియోజకవర్గంలో అనేక మంది రైతులు తుపాను వలన నష్టపోయారని రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాల రైతులను ఆదుకొని, కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో బాధిత రైతులు బాణాల తవుడు, నీలయ్య, గంట్యాడ పార్వతి, మహంతి లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు పిసిసి డెలిగేట్ కె.లక్ష్మి, కె.జోగినాయుడు, వై.సూర్యనారాయణ, జగదీష్ నాయుడు, ఎం.గణేష్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికుల ధర్నా

టెక్కలి రూరల్ : ప్రభుత్వం 2019లో విడుదల చేసిన జిఒలోని నియమాలను అమలు చేయాలని టెక్కలి డిపో కార్యదర్శి బసవల ధనుంజయరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌టిసి డిపో ఎదురుగా బుధవారం రెండు రోజు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగ మాట్లాడుతూ ఒఆర్ తక్కువ వచ్చిందని ఒక డిపో బస్సును, ఉద్యోగులను మరో డిపో బదిలీ చేయడం అన్యాయమని అవేదన వ్యక్తం చేశారు. ఎన్నడూ లేనివిధంగా పిపిసిల పేరుతో సర్వీసులను రద్దు చేశారని అన్నారు. దీంతో డ్రైవర్లకు, కండరర్లకు అన్యాయం జరుగుతుందన్నారు. తక్షణమే రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. డిపో అధ్యక్షులు డి.రమణమూర్తి, గ్యారేజ్ సెక్రటరీ రమేష్, చలం, కిరణ్, ప్రసాద్, జి.కె.రావు, కె.బి.రావు, ఎన్.ఎస్.రావు, ఆర్.పి.రావు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి- పొందూరు


మాట్లాడుతున్న ఎంపిపి ఉషారాణి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కిల్లి ఉషారాణి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అంచనా బడ్జెట్ ఆమోదం పొందిందని ఎంపిడిఒ సీపాన హరిహరరావు తెలిపారు. 2023-24 సవరణ బడ్జెట్, 2024-25 అంచనా బడ్జెట్ ఆమోదం పొందాయి. 2023-24లో ఆదాయం రూ.32,65,70,100 కాగా వ్యయం రూ.32,62,40,000, మిగులు బడ్జెట్ రూ.3,30,100, 2024-25 అంచనా బడ్జెట్ రూ.32,88,41,100 కాగా వ్యయం రూ.32,83,77,100లు మిగులు బడ్జెట్ రూ.4.64 లక్షలుగా మండల పరిషత్ సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు కిళ్లాన సూర్యారావు, వండాన శ్రీదేవి, వడగ పద్మావతి, వడగ పార్వతి, రమణ, లింగాల రాజయ్య పాల్గొన్నారు.


20న ఇంద్రపుష్కరిణి పనులకు శంకుస్థాపన


ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఇఒ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ పరిధిలో ఇంద్రపుష్కరిణి పున్ణ నిర్మాణ పనులకు ఈనెల 20న శంకుస్థాపన నిర్వహిస్తున్నట్టు ఇఒ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. రూ.4కోట్ల వ్యయంతో చేపట్టనున్న నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. ఈ మేరకు బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. నిర్మాణ పనులకు దేవాదాయశాఖ నుంచి రూ.2కోట్లు, దేవస్థానం నిధులు రూ.2కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, లుకలాపు గోవిందరావు, జలగడుగుల శ్రీనివాస్, జోగి మల్లెమ్మ, ద్వారపు అజిత్ కుమార్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల డిమాండ్లు నెరవేర్చాలి


వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి- లావేరు

జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ సహాయకులు మాధవరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ నాయకులు బొబ్బాది సత్యం, శ్యామలరావు మాట్లాడుతూ కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, మెండేస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతున్నామన్నారు.

అలాగే కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, మున్సి పాలిటీలో విలీనం అయిన గ్రామ పంచాయతీల్లో యధావిధిగా ఉపాధిహామీ పథకం హామీలు చేయాలన్నారు. విధి నిర్వహణలో మూడేళ్లు పూర్తి చేసుకున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎఫ్‌టిఇ అమలు చేచాలని, అర్హత ఉన్న వారికి ఉద్యోగోన్నతి కల్పించా లన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన ఫీల్డ్ అసి స్టెంట్లకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించా లని డిమాండ్ చేశారు. కార్యక్రమలంలో రామారావు, రాము, సూర్యనారాయణ, శంకర్ పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులతో నాయకులు

'కళా ఉత్సవ్‌' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కవిటి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన గురువులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జానపద నృత్యంలో 9వ తరగతి చదువుతున్న అరుణకుమార్, జానపద గీతంలో పదో తరగతి చదువుతున్న ఎన్.మణికుమార్, ఏకపాత్రాభినయంలో పదో తరగతి చదువుతున్న ఎస్.మణివర్మ, త్రీడీ ఆర్ట్‌లో పదో తరగతి చదువుతున్న డి.దేవరాజ్, 9వ తరగతి చదువుతున్న వర్షిణి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు వారికి శిక్షణ ఇచ్చిన పిఇటి శర్మ, గిరిబాబు, ఎస్.ఇ.శర్మలతో పాటు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపిటిసి పూడి నీలాచలం, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామ్

వైసిపి ఖాళీ కావడం ఖాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

త్వరలోనే వైసిపి ఖాళీ అవ్వడం ఖాయమని, రాబోయే ఎన్నికల్లో జనసేన, టిడిపి కూటమి ఘన విజయం సాధించడం ఖాయమని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. బుధవారం పట్టణంలో టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గడచిన పది సంవత్సరాలకు పైగా బెయిల్‌పై ఉన్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారిందన్నారు. రాష్ట్రంలో 30వేల మంది మహిళలు అదృశ్యమైనప్పటికీ ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. మరోవైపు ఎన్నికల్లో ఓటమి భయం నేపథ్యంలో అక్రమంగా ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించే దుర్మార్గపు చర్యకు జగన్ ప్రభుత్వం పూనుకుందని ఆరోపించారు. వైసిపి క్యాడర్‌లో భయం పట్టుకుందని, ఎక్కడ ఓడిపోతామోనని ఒక్కొక్కరిగా వైసిపి నుంచి జారి పోతున్నారన్నారు. మరి కొద్ది రోజుల్లో వైసిపి పూర్తిగా ఖాళీ అయిపోతుందన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గం జిల్లా టిడిపి కార్యదర్శి బోడేపూడి దొరబాబు పాల్గొన్నారు.


సమ్మె నోటీసు అందజేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

ఎంఇఒకు సమ్మె నోటీసు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సమగ్ర శిక్ష అభియాన్‌లో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న సిఆర్‌ఎంటిలు, సిఒలు, అకౌంటెంట్లు, మెసెంజర్లు, పలు విభాగాలకు చెందిన ఉద్యోగులు సమ్మెబాట పట్టనున్నట్లు తెలిపారు. బుధవారం మండల విద్యాశాఖ అధికారి జి.రాజేంద్ర ప్రసాద్‌ను కలిసి పలువురు విద్యాశాఖ ఉద్యోగులు సమ్మెనోటీసు అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత కొంతకాలం నుంచి జీతాలు చెల్లింపులు చేపట్టలేదని, వెంటనే పెండింగ్ జీతాలు చెల్లింపులు చేపట్టాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే తమకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించడం లేదని, దీనిపై ఈనెల 20 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి నర్సింగరావు, ఎం.వి. రమణ, శ్రీను, తేజ, జ్యోతి, ధనలక్ష్మి, చంద్రకళ, ప్రశాంత్ పాల్గొన్నారు.


వైసిపి జెండా ఆవిష్కరిస్తున్న ఎంపిపి పద్మ ప్రకాష్

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- కవిటి

ప్రజా సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఆదరించి, మరోసారి ఆశీర్వదించాలని ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్ కోరారు. మండలం శిలగాం గ్రామంలో బుధవారం జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించి పంచాయతీలో అమలు చేసిన సంక్షేమ పథకాల చార్ట్ విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా అవినీతి రహితంగా సంక్షేమ పథకాల అమలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆర్థికసాయం, రాష్ట్రంలో ప్రతి మహిళకు ప్రత్యేక గుర్తింపు ప్రస్తుత ప్రభుత్వంలోనే సాధ్యమైందని, అందుకే మళ్లీ జగనే అధికారంలోకి రావాలన్నారు. గ్రామంలో తిరుగుతు ప్రతి ఓటరుకు వైసిపి ప్రభుత్వం విధి విధానాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, పూర్తిస్థాయిలో అమలు జరిపిన మేనిఫెస్టో వివరాలు తెలియజేశారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడాలు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పూడి నేతాజీ, ఎఎంసి వైస్ చైర్మన్ నీలయ్య, వైసిపి లీగల్ సెల్ కన్వీనర్ పులకల శ్రీరాములు, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, బొర్ర రమేష్, పంచాయతీ కార్యదర్శి మన్మథరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పోలాకి: పార్టీలకతీతంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఖాతాల్లో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు అన్నారు. మండలంలోని డోల సచివాలయం పరిధిలో ఎపి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, సర్పంచ్ ప్రతినిధి ఉదయ్ భాస్కర్, ఎస్.ఎల్.పురం సర్పంచ్ ప్రతినిధి యారబాటి వెంకట రమణ, కణితి సత్తిబాబు, కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది నిరసన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పిడుగురాళ్ల పురపాలక సంఘంలో శానిటరీ సెక్రెటరీగా పని చేస్తున్న అశోక్ పై జరిగిన దాడిని ఖండిస్తూ ఇచ్ఛాపురం పురపాలక సంఘం ఆంధ్రప్రదేశ్ మినిస్ట్రీ రియల్ ఉద్యోగుల తరుపున సచివాలయం సిబ్బందికి సంఘీభావాన్ని ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగిపై దాడిని తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘీభావంలో మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం


పొందూరు : ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న స్పీకర్ సీతారాం

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలం బురిడికంచరాం గ్రామంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన, రంగామారిన ధాన్యాన్ని నిబంధనలు మేరకు అధికారులు కొనుగోలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ హయంలో పూర్తిగా దళారీ వ్యవస్థ నిర్మూలన జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎడిఎ శ్రీనివాసరావు, ఎఒ బెండిబాబ్జీ, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, పిఎసిఎస్ సిఇఒ ఎర్నేన పాపినాయుడు, సర్పంచ్ ప్రతినిధి గంట్యాడ రమేష్, ఎంపిటిసి బొత్స రమణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకు

క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సిఎం జగన్మోహన్‌రెడ్డి చేపట్టారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలం బురిడికంచరాంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న నవరత్న సంక్షేమ పథకాలకు ప్రజల్లో విశేష ఆదరణ లభించిందన్నారు. రానున్న ఎన్నికల్లో మరలా వైసిపి ప్రభుత్వం విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి గంట్యాడ రమేష్, ఎంపిటిసి బొత్స రమణ, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, స్థానిక నాయకులు పిన్నింటి అప్పనాయుడు, పీరుసాహెబ్, వాళ్ల రమణ, వండాన సాయి, వాళ్ల అప్పలనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

నందిగాం: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. నందిగాం రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు చేయూత అందించే విధంగా


నందిగాం : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తిలక్

పెట్టుబడి సాయం అందజేస్తుందన్నారు. రైతులు పండించిన పంటలను ఆర్‌బికె ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. రైతులు ధాన్యం విక్రయాల్లో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఆర్‌బికె సిబ్బంది ధాన్యం సేకరించి సకాలంలో బిల్లులు అందేవిధంగా చూస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, సర్పంచ్ జడ్యాడ జయరాం, ఎంపిటిసి అంబోడి విష్ణు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, వ్యవసాయశాఖ అధికారి శ్రీకాంత్‌వర్మ, మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధి ఎ.వి.పి.ఆర్.తాగూర్ పాల్గొన్నారు. అలాగే నర్సిపురం పిఎసిఎస్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపిపి ఎస్.శ్రీరామ్మూర్తి ప్రారంభించారు.

సమస్యలు వివరిస్తామంటే భయమెందుకు?

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గంలో సమస్యలకు సిఎంకు వివరిస్తామంటే పశుసంవర్థశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు భయమెందకని వామపక్ష నాయకులు చాపర వెంకటరమణ, తామాడ సన్యాసిరావు, జుత్తు వీరాస్వామి, నెయ్యిల ఢిల్లేశ్వరి, మద్దిల రామారావు అన్నారు. సిఎంను కలిసేందుకు అవకాశం ఇవ్వకపోవడానికి నిరసిస్తూ... కాశీబుగ్గ గాంధీ విగ్రహం దగ్గర పత్రికా ప్రకటనను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతం కరువుతో విలయతాండవం చేస్తుంటే... పాలక పక్షాలకు కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం బాధాకరమని అన్నారు. జీడి మద్దతు ధర లేక రైతులు తీవ్ర ఆవేదన


మాట్లాడుతున్న వాపమక్ష నాయకులు

చెందుతున్నా ఈ ప్రభుత్వానికి పట్టాదా? అని ప్రశ్నించారు. వంశధార చివరి ప్రాంత భూములకు నాలుగేళ్లుగా నీరుందడం లేదని, కాలువ ఆధునికీకరించకుండా రైతులకు నీరు ఎలా అందుకుందని ప్రశ్నించారు. ఇచ్ఛాపురం వరకు కాలువలను పొడిగించి రైతులను ఆదుకొనే ఆలోచన లేకపోవడం విచారకరమని అన్నారు. రూ. 700 కోట్లతో జలజీవన ధార మిషన్ ద్వారా పలాస మున్సిపాలిటీ ప్రజల చేసిన అన్యాయమేమిటని ప్రశ్నించారు. 2019 వరకు ఉన్న ఇఎస్‌ఐ డిస్పెన్సరీ ఇప్పుడు లేకుండా సుమారు 60 వేల మంది కార్మికులకు అన్యాయం చేస్తూ 200 పడకల ఆస్పత్రి పేరుతో ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. రోజుకు ఒకరు చొప్పున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు చనిపోతుంటే కిడ్నీ రిసెర్చ్ సెంటర్ అని చెప్పుకొనే ఆస్పత్రిలో ఎంతమంది శాస్త్రవేత్తలను, నెప్రాలజిస్టులను నియమించారో చెప్పాలని కోరారు. వీరితో చాపర వేణుగోపాల్, మద్దిల వినోద్, పాపయ్య, గోరు వాసులు ఉన్నారు.

మాటకు కట్టుబడిన సిఎం జగన్

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోయే నేతను కాదని జగన్ చాటి చెప్పారని వైసిపి జిల్లా అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురువారం ఉద్దానంలో పర్యటిస్తున్న సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్దానం కిడ్నీ వ్యాధుల నిర్మూలనకు తానెంతగా చిత్తశుద్ధితో పనిచేశారో ఇప్పుడు కళ్ల ముందు కనిపిస్తోందని చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి చెప్పాడంటే.. చేస్తాడంతే అని ప్రజలంతా గట్టిగా నమ్ముతున్నారన్నారు. ఉద్దాన ప్రాంత ప్రజలకు వంశధార నీరు అందించేందుకు సుమారు రూ.700 కోట్ల వ్యయంతో వైఎస్‌ఆర్ సుజల ధార ప్రాజెక్టును, అలాగే రూ.50 కోట్లతో నిర్మించిన వైఎస్‌ఆర్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నాలుగున్నర ఏళ్ల క్రితం ఎక్కడైతే మాట ఇచ్చి శంకుస్థాపన చేశారో అక్కడే ప్రారంభించుకోవడం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. పలాస, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లోని ప్రజలకు, భావితరాలకు గుండెల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. దశాబ్దాల తరబడి వేధిస్తున్న కిడ్నీ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.

దళితులకేం చేశారో చెప్పగలరా?

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులకు ఏమి న్యాయం చేశారో చెప్పగలరా? అంటూ టిడిపి దళిత జిల్లా నాయకులు మెట్ట పురుషోత్తం ప్రశ్నించారు. పలాస టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సిఎం జగన్ వస్తున్న సందర్భంగా దళిత సాధికారత అంటూ ఊరు ఊరు తిరుగుతున్నా మీరు ఈ నాలుగేళ్లలో దళితలకు ఏమైనా ప్రయోజనం చేకూర్చంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులు ఏమి చేశారని ప్రశ్నించారు. ఎటువైపు దారి మళ్లించారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో మునుపెన్నడూ జరగని విధంగా దళితులపై దాడులు, హత్యలు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో దళితుల సత్తా ఏంటో చెవిచూడక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో వడ్డీ యాదగిరి, గువ్వడ క్రాంతి, పట్ట మల్లేష్, బోనేల భైరాగి, బొబ్బిలి సంతోష్, రేగి పాపారావు, వడ్డి కూర్మారావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణితావధానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని బూర్జపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితావధానం అందరినీ ఆకట్టుకుంది. కంచిలి మండలం బూరగాంకు చెందిన గణితావధాని మడ్డు తిరుపతిరావు మస్టారు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు బి.రేఖ అధ్యక్షతన గణిత దశావధానం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గణితంలో పది అంశాలపై అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు క్షణాల్లో సమాధానాలు చెప్పారు. చివరలో అవధాని చేసిన ధారణ ప్రక్రియ అంటే ప్రోగ్రాంలోని అన్ని ప్రశ్నలకూ సమాధానాలు వరుసుగా చెప్పడం అందరినీ ఆశ్చర్యపరిచ్చింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.వెంకటరమణ, బి.శ్రీనివాసరావు, ఎం.రాజారావు, విజయకుమార్, కృష్ణకుమార్, గిరి చంద్రమోహన్, గిరిజ కుమారి ధనలక్ష్మి పాల్గొన్నారు.


ప్రశ్నలు వేస్తున్న ఉపాధ్యాయులు తిరుపతిరావు

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్‌ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం పురపాలక సంఘ పరిధిలో 22వ వార్డు వెంకయ్యపేటలో స్వయం సహాయక సంఘాల కమ్యూనిటీ ఆర్గనైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ ఆర్థిక అక్షరాస్యతపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు లావాదేవీలు, పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్, ఎటిఎం వివరాలను అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. బ్యాంక్ అధికారులు ఎప్పుడు ఖాతాదారుల వివరాలను ఫోన్ చేసి తెలుసుకోరని తెలిపారు. ఎటిఎంల్లో అపరిచితులకు కార్డును ఇచ్చి డబ్బులు విత్‌డ్రా చేయించరాదన్నారు.


అవగాహన కల్పిస్తున్న సిఎఫ్‌ఎల్ కో-ఆర్డినేటర్ వెంకటేష్

రూపే ఎటిఎం కార్డుల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. బ్యాంకులో అమలవుతున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ఇన్సూరెన్స్ పథకాల వివరాలను క్షుణ్ణంగా వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌పి జయశ్రీ, సిఎఫ్‌ఎల్ కో-ఆర్డినేటర్ రామారావు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రోటరీ క్లబ్ శ్రీకాకుళం, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా బుధవారం నగరంలో ఎజిఒ హోంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 20 మందికి కాటరాక్ట్ శస్త్ర చికిత్సలకోసం ప్రభుత్వ సర్వజనాసుపత్రి నేత్ర విభాగానికి పంపించారు. ఈ శిబిరాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ కె.త్రినాధరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యాన కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తూ అవసరమైన వారికి ఉచిత కళ్లద్దాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపిక చేసిన కాటరాక్ట కేసుల చికిత్సలు, అద్దాల పంపిణీ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కంటి విభాగాధిపతి డాక్టర్ పి. నిర్మల జ్యోతి మాట్లాడుతూ 40 ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరు కంటి పరీక్షలు చేసుకోవాలని,


నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సంపూర్ణ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలన్నారు. శిబిరంలో రోటరీ అధ్యక్షులు గీతా శ్రీకాంత్, నేత్ర వైద్య నిపుణులు డా.బికె జైన్, డా ఎస్.పుష్పలత, డా. పి శేషుబాబు, డా.వై సుష్మ శాంతి, డా.చక్రధర్, డా.సౌమ్య, ఆప్తాలమిక్ అధికారులు ఎంఆర్‌కె దాస్, ఎం.బాబురావు, రోటరీ కార్యదర్శి అన్నెపు అనంతరావు, రోటరీ ప్రతినిధులు డాక్టర్ మంత్రి వెంకటస్వామి, జైశ్రీరామ్, పసగడ సూర్యనారాయణ, దూసి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.


పవన్ పోరాటంతోనే కిడ్నీ ఆస్పత్రి నిర్మాణం

పలాస : పవన్ కళ్యాణ్ పోరాటంతోనే కిడ్నీ ఆస్పత్రి నిర్మాణం సాధ్యపడిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జనసేన పలాస నియోజకవర్గం ఇన్‌ఛార్జి డాక్టర్ వి.దుర్గారావు అన్నారు. కాశీబుగ్గలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. పవన్ కళ్యాణ్ ఉద్దాన ప్రాంతంలో పర్యటిస్తూ ఇక్కడి కిడ్నీ రోగుల స్థితిగతులను తెలుసుకొని 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉద్దాన ప్రాంత పరిస్థితులన్నీ కూలంకుసగా తెలియజేశారని గుర్తు చేశారు. ఆ తర్వాతే ఈ ప్రాంతంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి కిడ్నీ వ్యాధిగ్రస్తులపై పూర్తి పరిశోధన చేశారన్నారు. టిడిపి హయాంలో కిడ్నీ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ, రవాణా ఛార్జీలు ఇచ్చేవారని అన్నారు. కిడ్నీ ఆస్పత్రికి టిడిపి హయాంలోనే భూమి పరిశీలన చేశారని పేర్కొన్నారు. సమావేశంలో లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, సప్ప నవీన్ పాల్గొన్నారు.

పెరటితోటల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని అడ్డంగిలో పెరటి తోటల పెంపకంపై గిరిజన ఉప ప్రణాళికా కింద బుధవారం శిక్షణ ఇచ్చారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సునీత ఆధ్వర్యాన వెలుగు అసోసియేషన్ సహకారంతో ఈ శిక్షణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారంలో శారీరక అవసరమైన ఖనిజ లవణాలు, విటమిన్లు, వంట పోషక, పీచుపదార్థం వంటివి పోషక విలువలు కూరగాయలు ఆకుకూరలో సమురుద్ధిగా లభిస్తాయని అన్నారు. వీటిని ఆహారంలో విరివిరిగా ఉపయోగించడంతో రోగ నిరోధక శక్తిని పొందువచ్చని తెలిపారు. ఇంటి చుట్టూ అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలకు అనుగుణంగా వివిధ రకాలు, అందులో


విత్తనాలను అందజేస్తున్న శాస్త్రవేత్త సునీత

పెంచాల్సిన సంపూర్ణ ఆహార పంటలను సూచించారు. మార్కెట్‌లో దొరికే కాయగూరలలో తాజాగా ఉండే విధంగా రసాయలను కలపడం వల్ల అవి మన శరీరంలో చేరి పలు రుగమ్మతలకు కారణం అవుతుందని చెప్పారు. అనంతరం కూరగాయల రకాలు విత్తనాలు సంబంధించిన కిట్లను అందించారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ కార్యకర్త సవర నారాయణ, జగదీష్ పాల్గొన్నారు.

21 నుంచి శిక్షణా తరగతులు

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్అండ్‌హెచ్ విభాగం ఆధ్వర్యాన ఐతమ్ సౌజన్యంతో ఈ నెల 21, 22, 23 తేదీల్లో 'యూనివర్శల్, హ్యూమన్ వాల్యూస్ ఇంట్రడక్టరీ' అనే అంశంపై అధ్యాపకులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ శిక్షణ మూడు రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. అఖిల భారత కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ) నుంచి రిసోర్స్ పర్సన్లుగా డాక్టర్ యశ్వంత్ పాటిల్, డాక్టర్ కె.మహేశ్వరమ్మలు హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు, హెచ్ఐడి డాక్టర్ బి.శివకుమార్, డీన్లు, అసోసియేట్ డీన్లు, హెచ్‌డిలు, డాక్టర్ బి.వాసంతి, కో-ఆర్డినేటర్లుగా డాక్టర్ ఎన్.సాయిబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.


శిక్షణను ప్రారంభిస్తున్న ఎంఇఒలు

వికలాంగులకు శిక్షణ

ప్రజాశక్తి- పొందూరు

దివ్యాంగ పిల్లలకు ప్రత్యేకంగా అందజేస్తున్న ఒకేషనల్ శిక్షణతో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎంఇఒలు పి.వి.రామరాజు, పట్నాన రాజారావు అన్నారు. పొందూరు భవిత కేంద్రంలో ఒకేషనల్ శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ప్రారభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 13 నుంచి 18 సంవత్సరాలు వయసు గల బుద్ధిమాంద్యం, వినికిడిలోపం, శారీరక వైకల్యం వంటి సమస్యలతో బాధపడుతున్న దివ్యాంగ పిల్లలకు స్పైరల్ బైండింగ్, జిరాక్స్, లామినేషన్ వంటి పలు శిక్షణలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఇఆర్‌పి దినేష్, రాధారాణి, సిఆర్‌ఎంటి, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న వాణి

పంట నష్టం అంచనా వేయాలి

టెక్కలి రూరల్: నియోజకవర్గంలో ఎండిన వరినాట్లు, మిచౌంగ్ తుపాను పంట నష్టానికి అంచనా వేసి రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తున్నామని నియోజకవర్గం సమన్వయకర్త, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంత విస్తీర్ణంలో పంట నష్టం వాటిల్లిందో వివరాలు, పండిన పంట ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఇదివరకే నాలుగు మండలాలకు కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎడి బి.వి.తిరుమలరావు, ఎఒ గురుబెల్లి రంగారావు, ఇఒలు పాల్గొన్నారు.

నేడు టిడిపి విస్తృతస్థాయి సమావేశం

ఆమదాలవలస : టిడిపి విస్తృతస్థాయి సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కొర్లకోట రోడ్డులో శ్రీనివాస కళ్యాణ మండపంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో వెలువరించింది. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా మాజీమంత్రి కెఎస్ జవహర్ హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీలు, రాష్ట్ర, జిల్లా పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు, మండల పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, మాజీ, ప్రస్తుత ఎంపిటిసిలు, మాజీ, ప్రస్తుత సర్పంచ్‌లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ప్రకటనలో కోరారు.

ఆస్పత్రిలో సౌకర్యాల కల్పనకు లేఖ

టెక్కలి : డివిజన్ కేంద్రమైన టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందులకు రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి బుధవారం లేఖ రాశారు. ఆస్పత్రిలోని ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. రోగులకు ఆవసరమైన సామగ్రి, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

దుండగులను శిక్షించాలి

టెక్కలి రూరల్ : భారత లోక్‌సభ జరుగుతున్న సమయంలో ఇద్దరు ఆగంతకులు గేలరీ నుంచి దూకిన సంఘటన దిగ్భ్రాంతి కలిగించిందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల సంఘం జాతీయ అధ్యక్షులు చౌదరి రాధాకృష్ణ, ప్రకటనలో పేర్కొన్నారు. భద్రతా సిబ్బంది సంఘటన జరిగిన కొన్ని సెకండ్లలో దుండగులను అదుపులో తీసుకోవడం కొంత ఊరట కలిగించిందని పేర్కొన్నారు. భద్రతా ఏర్పాట్లు మరింత పటిష్ట పర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈయనతో పాటు ప్రధాన కార్యదర్శి కొమ్మన పురుషోత్తం, ఉపాధ్యక్షుడు డి.ఎ.స్టాలిన్, కోశాధికారి కొప్పల సూర్యనారాయణ, కార్యదర్శి పారశెల్లి రామరాజు, కార్యవర్గ సభ్యులు కె.తిరుమలరావు ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు

పోలాకి: ఇటీవల నిర్వహించిన సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన మండలస్థాయి క్విజ్ పోటీల్లో పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని ప్రధానోపాధ్యాయులు ఆర్.లక్ష్మి తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో బహుమతులు పొందిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయలు భానుప్రకాష్, గంగరాజు పాల్గొన్నారు.

మురుగునీటితో అవస్థలు

కోటబొమ్మాళి: స్థానిక మేజర్ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. డ్రెయినేజీల ద్వారా ముక్కులు పగిలిపోయేలా మురుగు కంపు కొడుతున్నా పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారు. మురుగునీరు పోయేందుకు చర్యలు మాత్రం చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నారు. ఇటీవల సంభవించిన మిచౌంగ్ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు డ్రెయినేజీల్లో చెత్తా చెందారం అడ్డుకొని మురుగు కాలువల్లో ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలతో, ఈగలతో నరకయాతన పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.